
# నోటికొక్కడు

-సాయి బ్రహ్మానందం గొర్తి



ఉగాది
కథల పోటీలో
ఎంపికైన కథ

నాకు మొట్టమొదటిసారి అమెరికా వెళ్ళే అవకాశం వచ్చింది.

ఇంకో వారంరోజుల్లో ప్రయాణం. నా భార్య లలిత, అమెరికా వెళ్ళే ముందు తిరుపతి వెళదామంటే కుటుంబ సమేతంగా తిరుపతి ప్రయాణం కట్టాను. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనానికి కనీసం రెండురోజులు పడుతుందని తెలిసింది. ఎవరో స్నేహితుడికి తెలుసున్న వాళ్ళు దేవస్థానం ఆఫీసులో ఉన్నారంటే కలిసాను. ఆయన దర్శనం ఏర్పాటు చేసారు. కానీ వసతి గదులు మంచివి కావాలంటే కాస్త ఖర్చు అవుతుందంటే గత్యంతరం లేక సరేనన్నాను. శ్రీనివాసుని కంటే ముందుగా వీళ్ళకు మొక్కు చెల్లించుకొని దర్శనానికి వెళ్ళాను.

దర్శనం బాగానే అయ్యింది. ఆరోజు సాయంత్రం హైదరాబాదు రైలు కెళదామని ఆదరాబాదరా కింద కొచ్చాం. రిజర్వేషన్‌కి ప్రయత్నించాను. యథాప్రకారం ఖాళీలేదు.

నేను అక్కడ రిజర్వేషను కిటికీ దగ్గర ఉండగా ఒకతను నా దగ్గరకొచ్చి "సార్! హైద్రాబాద్‌కి బెర్తు ఇప్పిస్తాను. కాస్త ఖర్చు అవుతుంది" అన్నాడు. చేసేది లేక సరేనన్నాను.

నన్ను మామూలు టిక్కట్టు కొనుక్కోమని చెప్పి, సదరు టిటితో మాట్లాడి వస్తానని చెప్పి వెళిపోయాడు. ఓ ఇరవై నిముషాల తరువాత వచ్చి నన్ను ఎస్ 4 బోగీ దగ్గర ఉండమని చెప్పాడు. బండి వచ్చింది. నేనూ, లలిత, పిల్లాడు బోగీ దగ్గర నించున్నాం. కొంత సేపటికి టిటి వచ్చాడు. నన్ను రమ్మనమన్నట్లు మొదటిసారి కలిసినతను సైగ చేసాడు. వెళ్ళాను.

"హైద్రాబాదు 3 బెర్తులు కావాలి" అని ఆయనకి చెప్పి, నావైపు తిరిగి "సార్ చూస్తారు, లోపల కూర్చోండి" అన్నాడు. సరేనంటూ సామానులు తీసుకొని రైలు ఎక్కబోతుండగా అతను మళ్ళీ వచ్చాడు.

"సార్! బెర్తు వచ్చింది కదా సార్! నా మామూలు..." అంటూ నీళ్ళు నమిలాడు.

"ఎంత?"

"రెండువందలు సార్!"

"రెండువందలా?" ఆశ్చర్యపోయాను.

"అవును సార్! రైలు రద్దీగా ఉంది కదా సార్! అతి కష్టంమీద సంపాదించాను సార్!"

చేసేది లేక వంద కాగితం చేతిలో పెట్టాను. ఒక్కసారి నావైపు గుర్రుగా చూసాడతను.

"లేదు సార్! రెండువందలు తక్కువ కుదరదు. వద్దంటే చెప్పండి ఇంకో బేరం చూసుకుంటాను."

వాడితో వాదించడం ఇష్టంలేక విసుక్కుంటూ అతని చేతిలో రెండువందలు పెట్టి రైలు ఎక్కాను. టిటి టిక్కట్ తనిఖీ చేస్తున్నాడు. నన్ను చూసి "చూస్తాను" అన్నట్లు సైగ చేసాడు. కొంతసేపయ్యాక నాకు, మా శ్రీమతికి బెర్తులు కేటాయించి డబ్బు కట్టమన్నాడు. బెర్తుకోసం కదా అనుకొని అయిదువందల కాగితం ఇచ్చాను. జేబులో వేసుకొని నా చేతిలో రశీదు పెట్టి వెళ్ళిపోయాడు. రశీదు చూస్తే నా గుండె తరుక్కుపోయింది. నూటఏభై రూపాయలు రెండు బెర్తులు కలిసి, ఈ మహానుభావుడు మిగతాది నొక్కేసాడు. చేసేది లేక తిట్టుకుంటూ బెర్తులో చతికిలబడ్డాను. పెట్టెలు అన్నీ దగ్గర పెట్టుకొని రాత్రి నిద్రపోకుండా చూస్తూ ఉండమని లలిత నాతో చెప్పింది. ఎప్పుడు నిద్ర పట్టేసిందో తెలియదు, తెల్లారేక వికారాబాద్‌లో మెలుకువ వచ్చింది.

నా బెర్తు కింద పెట్టె మాయమయ్యిందని అప్పుడు చూసాను. కంగారుగా బోగీ అంతా వెదికాను. గబగబా క్రిందకు దిగి స్టేషన్ మాస్టర్ని అడిగితే, 'మీ పెట్టెదో మాకెలా తెలుస్తుందండి. పోలీసు కంప్లైంట్ ఇవ్వండి.' అన్నాడు. ఈలోగా రైలుకి సిగ్నల్ ఇచ్చాడు.

"ఎలాగ సార్! రైలు కదిలిపోతోంది.?" కంగారుగా అడిగాను.

"నాంపల్లి స్టేషన్‌లో పోలీసు కంప్లైంట్ ఇవ్వండి" అన్నాడు. రైలు కదులుతుంటే పరుగున ఎక్కాను. "అవును ఇంతకీ ఆ పెట్టెలో ఏం సర్దావు?" ఆత్రంగా అడిగాను లలితను.

"నా పట్టుచీరలు, మీ బట్టలు, కొంత బంగారం... పెట్టెకు గొలుసు కొని వేద్దామంటే అక్కర్లేదని తోసిపుచ్చారు.."

"అది సరే... ఇంకేమైనా ముఖ్యమైనవి ఉన్నాయా...?"



అప్పుడు గుర్తొచ్చింది, అమెరికా ప్రయాణం టిక్కట్లు అందులో నేనే పెట్టిన సంగతి.

* * *

హైద్రాబాదు చేరగానే నాంపల్లి స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాను. అక్కడ ఒక బుర్రమీసాల కానిస్టేబుల్ "సార్! కంప్లైంట్ ఇచ్చారు కదా! రెండురోజుల తరువాత రండి." చాలా కాజువల్‌గా అన్నాడు.

నా అమెరికా ప్రయాణం సంగతి, టిక్కట్ల సంగతి చెప్పాను. అమెరికా అనగానే సదరు కానిస్టేబులుకి ఒక్కసారి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది.

"కుదరదు సార్! టైం పడుతుంది. అన్ని స్టేషన్‌లలో వాకబు చెయ్యాలి." అతనికి నా తొందర అర్థమయ్యిందనుకుంటాను. మరింతగా పట్టుబిగించాడు. బ్రతిమాలితే, "ఓ వెయ్యి రూపాయలు ఇవ్వండి... వాళ్ళకి ఇప్పుడే ఫోన్ చేసి కనుక్కుంటాను. మీ కాంటాక్ట్ టెలీఫోన్ నెంబరు ఇవ్వండి. రేపు ఉదయం రండి..." అంటూ నా చేతిలో కంప్లైంట్ తీసుకొని చదివాడు. అతనికి వెయ్యి రూపాయలు ఇచ్చి మా తమ్ముడి ఇంటికి బయల్దేరాను.

* * *

లలితకి దిగులు పెరిగిపోయింది. 'టిక్కట్లు ఎలా వస్తాయి? అమెరికా ప్రయాణం లేనట్లేనా?'

కంగారు పడనవసరం లేదని, డూప్లికేటు టిక్కట్లు ఇస్తారని చెప్పి, బషీర్‌బాగ్‌లో ఉన్న లుఫ్తాంసా ఎయిర్లైన్స్ ఆఫీసుకు బయల్దేరాను.

అక్కడికి వెళ్ళి మా టిక్కట్లు పోయిన సంగతి చెప్పాను. మా వివరాలు ఇవ్వగానే డూప్లికేట్ టిక్కట్ ఇస్తానని, కొంత సమయం పడుతుందని చెప్పాడు. ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాను. ఓ అరగంట తరువాత, ఆ ఆఫీసరు నా దగ్గరకి వచ్చి, "సార్! మేము డూప్లికేట్ టిక్కట్ ఇవ్వాలంటే మీరు పోలీసు కంప్లైంట్ ఇచ్చినట్లు మాకు కాపీ ఇవ్వాలి. అంతే కాదు. వాళ్ళు వెతికినట్లుగా రాస్తూ, దొరకలేదని అందులో రాసి ఇస్తే, మేము డూప్లికేట్ టిక్కట్ ఇస్తాం."

సరేనన్నట్లుగా తలూపి 'దేముడా' అనుకుంటూ నాంపల్లి స్టేషన్‌కి బయల్దేరాను.

* * *

నాంపల్లి స్టేషన్‌లో ఉదయం నే కలుసుకున్న బుర్ర మీసాల కానిస్టేబుల్ కోసం చూసాను. ఆయన అక్కడ ఉన్నట్లుగా లేదు. ఇంకో వ్యక్తి ఉన్నాడు.

"ఏం కావాలి సార్?" నన్ను చూడగానే అడిగాడు.

"ఈరోజు ఉదయం నేను నా పెట్టె పోయిందని కంప్లైంట్ ఇచ్చాను సార్! దానికోసం వచ్చాను..."

"ఎవరికిచ్చారు?"

"ఆయన పేరు గుర్తు లేదు... బుర్ర మీసాలు ఉన్నాయి..."

"యాదవ్ కా- అతని డ్యూటీ అయిపోయింది. వెళిపోయాడు. ఉండండి కంప్లైంట్ ఉందో లేదో చూస్తాను..." అంటూ టేబిల్ మీద కాగితాలు వెతికాడు.

"లేదు సార్! ఈరోజు ఒక్క కంప్లైంట్ ఇచ్చినట్లుగా లేదు..."

"అది కాదు సార్ నిజంగానే ఇచ్చాను."

"లేదని చెబుతున్నకదా... ఉంటే ఇవ్వనా? మీరే చూడండి..."

ఒక్కసారి కంగారు మొదలయ్యింది నాకు. నా ప్రయాణం గురించి, బుర్రమీసాలాయనకి వెయ్యి రూపాయలు ఇచ్చిన సంగతి కూడా చెప్పాను.

ఎలాగైనా చూడమని బ్రతిమాలేను.

అతను యాదవ్ సెల్‌కి ఫోన్ చేసాడు. ఫలితం లేకపోయింది.

నా ఆత్రుత చూసి-

"ఉండండి... ఓ అరగంటలో గోవర్ధనరెడ్డి సార్ వస్తారు. ఆయన చెప్తారు ఏం చెయ్యాలో..."

ఓ గంట తరువాత ఓ జీప్‌లో గోవర్ధనరెడ్డి అనుకుంటా దిగాడు. అతని వాలకం, హడావిడి చూస్తే అతనే అనిపించింది నాకు. అతన్ని చూడగానే నమస్కరించాను. నమస్తే అంటూనే లోపలికి వెళ్ళిపోతూ ఏమిటన్నట్లు నావైపు చూసాడు.

నే దగ్గరకి వెళ్ళి సంగతి చెప్పాను.

అంతా విని... "మీరు వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వాలి. వస్తువు పోయింది అక్కడ కదా... ఇక్కడ మేం కంప్లైంట్ తీసుకోము..." అన్నాడు.

నా పరిస్థితి వివరించాను. వికారాబాద్ స్టేషన్ మాస్టర్ నాంపల్లిలో కంప్లైంట్ ఇమ్మన్న సంగతి కూడా చెప్పాను. ఇది విని గోవర్ధనరెడ్డికి కోపం వచ్చింది.

"ఆ స్టేషన్ మాస్టర్‌కేం తెలుసుద్ది మా పోలీసు రూల్స్... మీరు వికారాబాద్ వెళ్ళి అక్కడ కంప్లైంట్ ఇచ్చినట్లుగా లెటర్ తీసుకొని రండి. ఆ లెటర్ చూసేకా మేం ఇన్వెస్టిగేట్ చేస్తాం. టైం పడుతుంది మరి..."

"సార్! ఇంకో రెండురోజుల్లో అమెరికా ప్రయాణం. ఎయిర్‌లైన్ వాళ్ళు డూప్లికేట్ టిక్కట్ ఇవ్వాలంటే మీనుండి లెటర్ కావాలన్నారు... దయచేసి..." ప్రాధేయపడ్డాను.

"నేనేం చేయగల్ను చెప్పండి. రూల్సు ఇలా ఉన్నాయి."

మరోసారి బ్రతిమాలాను.

"ఒక పని చెయ్యండి. మీరు తక్షణం వికారాబాద్ వెళ్ళి కంప్లైంట్ ఇచ్చినట్లు కాపీ తీసుకురండి. అక్కడి ఎస్ఐ చేత సంతకం పెట్టించుకు రండి. ఈలోగా నేను మా వాళ్ళకి ఫోన్‌చేసి వాకబు చేయిస్తా... కాని..." మధ్యలో ఆగి... ఏయ్! యాద్‌గిరి సారుకి ఏంచెయ్యాలో చెప్పు..." అని నావైపు తిరిగి, మా యాద్‌గిరి మీకేం చెయ్యాలో చెబుతాడు... మీరు కంప్లైంట్ రాసి రేపు కలవండి."

నేను యాద్‌గిరి వెనుకే వెళ్ళాను. అతను కంప్లైంట్ ఎలా రాయాలో చెబుతూ... "సార్! ఈ పని త్వరగా కావాలంటే కాస్త ఖర్చవుతుంది..." నీళ్ళు నమిలాడు.

"ఎంత?" నాకు ఆలోచించే సమయం లేదు.

"అయిదు వేలు..."

"అయిదు వేలా?" గత్యంతరం లేక సరేనన్నాను. కంప్లైంట్ రాసి అతని చేతిలో అయిదువేలు పెట్టాను. ఆ డబ్బు అతను గోవర్ధనరెడ్డి చేతికివ్వడం కళ్ళారా చూసాను.

అతను జేబులో పెట్టుకున్నాడు.

బయటకు వస్తూ, "ఏం వర్రీకాకండి. రేపటికల్లా మీకు కంప్లైంట్ కాపీ ఇస్తాం" అంటూ అభయమిచ్చాడు.

నా టైం బాగోలేదనుకొని వికారాబాద్ ప్రయాణమయ్యాను.

వికారాబాద్ స్టేషన్‌లోనూ ఇదే ప్రహసనం. అక్కడ ముడుపులు భారీగా చెల్లించాక రాత్రికి హైదరాబాద్ చేరుకున్నాను. అక్కడ ఎస్ఐకి నా పరిస్థితి ముందుగానే తెలుసు. నే వస్తున్నానని గోవర్ధనరెడ్డికి ఫోన్ చేసినట్లుగా కూడా చెప్పాడు. ఒక చిన్న కంప్లైంట్ రాసి ఇవ్వడానికి ఇంత తతంగం ఉంటుందా అనిపించింది. ఏమయితేనేం ఇదొక అనుభవం.

దైవదర్శనం నుండి, రైలు రిజర్వేషన్ మొదలుకుని... ఏ చిన్న పని కావాలన్న చేతులు తడుపుతూ పోవాలి... ఇలాంటి వ్యవస్థలో చిక్కుకుపోయాడు సగటు మనిషి. నాకు తగినంత సంపాదన ఉంది. సమయం లేనందున నేనూ ఆ వ్యవస్థని ప్రోత్సహించినాను. విచిత్రం ఏమిటంటే- అడగడానికి మాత్రం ఎవ్వరూ కాసింత కూడా వెనుకాడడం లేదు. సిగ్గు అనే పదం మెల్లమెల్లగా ప్రజల జీవితాల్లోంచి తప్పుకుంటోందనిపిస్తోంది.

* * *



మొత్తానికి గోవర్ధనరెడ్డిగారి నుండి లెటర్ తీసుకొని లుఫ్తాంసా ఎయిర్లైన్ ఆఫీసుకు ఆటోలో బయల్దేరాను. కుకట్పల్లి దగ్గర ఒక ఆటో అతనితో బేరం మాట్లాడుకున్నాను.

'రోజంతా నాతోనే ఉండాలి, మీటర్ కాక కాస్త అతనికి బేటా ఇస్తా'నని చెప్పాను.

"సార్! రోజంతా కష్టం సార్! మధ్యాహ్నం రెండుకి పిల్లల్ని స్కూల్ నుండి తీసుకురావాలి. రెండువరకూ ఉంటాను..."

సరేనన్నాను. ఆ ఆటో అతని పేరు నాజర్! లుఫ్తాంసా ఎయిర్లైన్ వాళ్ళు నా పాస్పోర్ట్ సైజు ఫొటో అడిగారు. క్రితం రాత్రి వికారాబాద్, నాంపల్లి స్టేషన్‌లో కంప్లైంట్ కాపీలు, నా పాస్‌పోర్ట్, అన్నీ ఆటో ఎక్కేక మరోసారి చెక్ చేసుకున్నాను. ముందుగా స్టూడియోకి వెళ్ళి ఫొటోలు తీయించుకొని ఎయిర్లైన్ ఆఫీసుకెళ్ళాలని అతనితో చెప్పాను. దారిలో నా పెట్టె పోవడం గురించి, నా ఇక్కట్లు అన్నీ చెప్పాను. అతని వివరాలు అడిగాను.

"మాదేముంది సార్! రోజీ ఆటో నడుపుకుంటే రెండుమూడొందలు మిగుల్తాయి. పెద్ద సంసారం కదా! ఖర్చులూ ఎక్కువే సార్!"

ఫొటో తీయించుకున్నాక ఆటోకి డబ్బులిచ్చి ఎయిర్లైన్ ఆఫీసుకు వెళ్ళాను. కంప్లైంట్ కాయితాలు అందజేసాను. అక్కడ ఆఫీసరు అవన్నీ చూసి 'ఓకే సార్! కాస్త టైం పడుతుంది. ఈరోజు శనివారం. మేం రెండువరకే పనిచేస్తాం. మీకు రెండులోగా టిక్కట్లు ఇవ్వడానికి ట్రై చేస్తాను. ఎందుకంటే మేం ఇంటర్నేషనల్ ఆఫీసుని కాంటాక్ట్ చేసి టిక్కట్ ఇష్యూ చెయ్యాలి. ఈలోగా మీ పాస్‌పోర్ట్ ఇస్తారా?" అని అడిగాడు.

బాగ్ లోంచి తీసి ఇద్దామని చూస్తే అందులో పాస్పోర్ట్ కనిపించలేదు. ఒక్కసారి కంగారు మొదలయ్యింది. బాగ్ అంతా వెతికాను. ఎక్కడా లేదు. బయల్దేరేముందు ఉంది - ఆటోలో కూడా చూసాను. కొంపతీసి ఆటోలో పడిపోయిందా? కంగారుగా బయటకొచ్చి చూసాను. ఆటో కనిపించలేదు. నాజర్‌కోసం వెతికాను. పాస్పోర్ట్ పోయిందని లోపలకొచ్చి చెబితే-

"ఏమిటి సార్! మీరు చాలా కేర్లెస్‌గా ఉన్నారు. నిన్న టిక్కట్లు పోయాయి. ఇవాళ పాస్పోర్ట్... ఇలాగయితే మీరు ఇంటర్నేషనల్ ట్రావెల్ చేసినట్లే!" అపహాస్యం చేసాడతను.

గోరు చుట్టుమీద రోకలి పోటులా ఇదొకటి. ఏంచెయ్యాలో పాలుపోలేదు. నాజర్ ఆటో నంబర్ కూడా తెలియదు. ఎలా పట్టుకోవడం. ఈ ఆఫీసు రెండుకల్లా మూసేస్తారు. ఈలోగా అతనే అన్నాడు. కనీసం ఫొటో కాపీ అయినా ఇమ్మనమని. ఇంటికి ఫోన్‌చేసి లలితని తెమ్మని చెప్పాను. ప్రస్తుతం టిక్కట్లు సరే! పాస్పోర్ట్ లేకుండా ప్రయాణం ఎలా చెయ్యడం. రేపు ఆదివారం కూడా. ఇక గత్యంతరం లేదు. నా ప్రయాణం క్యాన్సిల్ చేసుకుందామని అనుకున్నాను. ముందుగా మా మేనేజరుకి బెంగళూర్ ఫోన్‌చేసి చెప్పాలి. ఇది తరువాతయినా చెయ్యచ్చు. ముందు లలిత ఫొటోకాపీ తీసుకొస్తే సగం గొడవ తగ్గుతుంది. నేను అక్కడే ఉన్న సోఫాలో కూలబడ్డాను. మనసు స్థిమితంగా లేదు. ఓ అరగంట తరువాత డోర్ తెరుచుకుంటూ ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు.

ఒక్కసారి నన్ను నేను నమ్మలేకపోయాను. అతను నాజర్!

నన్ను చూడగానే, నా దగ్గరికి వస్తూ-

"సార్! మీ బుక్ ఒకటి పడిపోయింది సార్! స్కూల్ దగ్గర అడిగితే ఇది చాలా ముఖ్యమైన బుక్ అని చెప్పారు. మీ ఫొటో చూసి మీరిక్కడే ఉంటారనుకొని వచ్చాను సార్! దేముడి దయవల్ల మీరు దొరికారు సార్."

ఒక్కసారిగా పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్లనిపించింది నాకు. ఆనందం తట్టుకోలేకపోయాను. నాజర్ చేతులు గట్టిగా పట్టుకొని-

"థాంక్స్! నన్ను కాపాడావు. ఇది లేకపోతే నా ప్రయాణం అంతా గల్లంతయ్యేది. దేవుడిలా వచ్చి రక్షించావు- నీ రుణం తీర్చుకోలేను."

"అంత పెద్ద మాటలెందుకు సార్! నా పాసింజర్ వస్తువు ఆయనకి చేర్చా అంతే ఇందులో నేచేసిందేమీ లేదు..."

"పోయిన సరుకు ఇలా ఎవరు తిరిగి తీసుకొస్తారు చెప్పు." అంటూ నేను జేబులోంచి ఓ అయిదు వందలు తీసి అతని చేతిలో పెట్టాను.

నాకేసి అదోలా చూసి తిరిగి నా చేతిలో పెట్టేశాడు.

"నేనలాంటి వాణ్ణి కాదు సార్! ఈ డబ్బు తీసుకుంటే, పోయిన వస్తువు మీకు తిరిగి ఇచ్చానన్న తృప్తి మిగలదు సార్! మీ డబ్బుకన్న నాకు అదే ముఖ్యం. నా మనసు ఒప్పుకోదు సార్! ఏదయినా కష్టపడి సంపాదించుకోవాలి. కాని..."

"నువ్వు అడగలేదు సరే- నేనే ఆనందంగా ఇస్తున్నాను." బ్రతిమాలాను. నాజర్ ప్రవర్తన చూసి ఒక్కసారి స్థాణువయ్యాను.

"పోయిన వస్తువు దొరికిందన్న ఆనందం మీ కళ్ళలో చూసాను. ఈరోజుకొక మంచి పనిచేసాను అన్న తృప్తి చాలు సార్."

హిమాలయ శిఖరంలా ఎత్తయిన నాజర్ ప్రవర్తన ముందు నేనొక మరుగుజ్జులా అనిపించింది. అతనిలోని నిజాయితీ నన్ను కదిలించింది.

మరలా ఇండియా వచ్చినప్పుడు అతన్ని తప్పకుండా కలవాలనిపించి అతని అడ్రస్సు తీసుకున్నాను. నాజర్ లాంటి వ్యక్తులుండడంవల్లే మనుష్యుల మీద ఇంకా నమ్మకం మిగులుతోంది. ఇలాంటి వాళ్ళు వందకి ఒక్కడున్నా చాలు ఈ సమాజం నిలబడుతుంది. చెమర్చిన కళ్ళతో నాజర్‌కి వీడ్కోలు చెప్పాను.

(మిగతా 27వ పేజీలో)


# సైన్స్ గ్రాఫ్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## మొసలి కన్నీరు అంటే ఏమిటి?

మొసలి అంటే మనిషికి భయం. ఎందుకంటే మొసళ్ళు మనిషిని భక్షిస్తాయని చాలామంది అనుమానం. నిజానికి మొసలి మనిషిని భక్షించలేదు. గంగానదిలో ఒక వేటగాడు మొసలిని పట్టుకున్నాడు. దానిని చంపి పొట్ట చీల్చి చూసే సరికి అందులో మనిషి అవశేషాలు కన్పించాయి. మనిషి శవాన్ని గంగానదిలో మొసలి పీక్కుని తిని ఉండవచ్చు.

ఈ సంఘటన బహుళ ప్రచారం పొంది మొసలి మనిషిని భక్షిస్తుందని చాలామంది భావించడం జరిగింది. మొసలి పిల్లను పట్టుకుని పెంచితే నలభై సంవత్సరాలకు మించి బ్రతకదు. నైలు నదిలోని మొసళ్లను పరిశీలించిన పరిశోధకులు ఆరు మీటర్లు పొడవుగల మొసళ్ల వయసు వంద సంవత్సరాలకు మించి ఉండవచ్చునని అంచనా వేశారు.



మొసలి జన్మించిన రెండు సంవత్సరాల కాలం తరచు ప్రమాదాలకు లోనవుతూ ఉంటుంది. పిల్లులు, అడవి కుక్కలు, కొన్ని రకాల పక్షులు వీటిని భక్షించడానికి ప్రయత్నిస్తాయి.

తమ ప్రాణరక్షణకు మొసళ్ళు నీటిలో దాక్కుంటాయి. ప్రమాదం లేదనుకున్న సమయంలో అవి నీటి నుండి బయటకు వచ్చి ఇసుకలో విశ్రమిస్తాయి. మనిషికి ఆహారంగా ఉపయోగపడే చిన్న చేపల్ని, పెద్ద చేపల్ని మొసళ్ళు తింటాయి. మొసళ్ళు పెద్ద చేపల్ని తినడంవల్ల చిన్న చేపలు మనిషికి ఆహారంగా దొరుకుతున్నాయి.

మొసలి మరుగు ప్రదేశంలో గుడ్లు పెడుతుంది. కొన్ని సందర్భాలలో మొసలి ఇసుకలో గుడ్లు పెట్టి అవి పైకి కనపడకుండా ఇసుకతో కప్పి వేస్తుంది. గుడ్డు లోపల మొసలి పిల్ల తయారయ్యిందంటే అది గుడ్డులో విచిత్రమైన శబ్దాలు చేస్తూ ఉంటుంది.

ఈ శబ్దాలను పసిగట్టి తల్లి మొసలి జాగ్రత్తగా తన కాళ్లతో గుడ్డును పగలగొట్టి లోపలి పిల్లకి విముక్తి కలుగజేస్తుంది. ఈ మొసలి పిల్ల ఏడాదికి దాదాపు అడుగు పొడవు చొప్పున ఎదుగుతుంది. పది సంవత్సరాల కాల వ్యవధిలో ఎనిమిది అడుగులకు ఎదిగి సుమారు నూట యిరవై కిలోగ్రాముల బరువు ఉంటుంది.

'మొసలి కన్నీరు కార్చకు!' అనే మాట తరచు మనం వింటూ ఉంటాము. మొసలి తనకు ఇష్టమైనపుడు దుఃఖంతో కన్నీరు కారుస్తుందా? అని అనుమానం కలుగుతుంది. మొసలి కన్నీరు కార్చడం వెనుక ఆసక్తికరమైన సైన్సు ఉంది.

సాగర జలాల్లో ఒక లీటరు నీటిలో సగటున ముప్పయి అయిదు గ్రాముల లవణాలు కరిగి ఉంటాయి. సాగర జలాన్ని ఎవరయినా సేవిస్తే వారి శరీరంలోకి సోడియం, పొటాషియం, కాల్షియం లవణాలు చేరుతాయి. ఈ లవణాలు రక్తంలోకి చేరాయంటే ప్రమాదం ముంచుకు వస్తుంది.

సముద్రంలో ఇతర జలచరాల మాదిరి మొసలి కూడా నివసిస్తుంది. అది తన ఆహారంతోబాటు కొంత సముద్రపు నీటిని కూడా తీసుకుంటుంది. ఆహారంతోబాటు ఈ నీరు దాని శరీరంలోకి వెళ్లిపోతుంది.

మొసలి శరీరంలో ఒక రకమైన ఏర్పాటు ఉంది. ఇది పరికరంలా పనిచేసి శరీరంలో జేరిన అధికమైన లవణాలను తొలగిస్తుంది. ఈ పనిచేసే గ్రంథులను లవణ గ్రంథులు అంటారు.

ఈ గ్రంధి మొసలి కంటి వైపు భాగాన తెరచుకుని ఉంటుంది. శరీరంలో అధికంగా వున్న లవణాలను పారదర్శక ద్రవ రూపంలో ఈ గ్రంధి కంటి నుండి బహిర్గతం చేస్తుంది. ఈ విధంగా బహిర్గతమయినప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నట్లు కన్పిస్తుంది. నిజానికి అవి కన్నీళ్లు కావు.

మొసలి విడుదల చేసే ఈ కన్నీరులో సముద్ర జలాల్లో ఉండే లవణ గాఢతకన్నా రెండుమూడు రెట్లు ఎక్కువ లవణ గాఢత ఉంటుంది. ఇదే అసలు సంగతి. ★

**'మొసలి కన్నీరు కార్చకు!' అనే మాట తరచు మనం వింటూ ఉంటాము. మొసలి తనకు ఇష్టమైనపుడు దుఃఖంతో కన్నీరు కారుస్తుందా? అని అనుమానం కలుగుతుంది. మొసలి కన్నీరు కార్చడం వెనుక ఆసక్తికరమైన సైన్సు ఉంది.**

---

*(9వ పేజీ తరువాయి)*

మొత్తానికి నాకు డూప్లికేట్ టిక్కట్లు వచ్చాయి. సాయంత్రం అయిదుగంటల ముందే విమానంకోసం బేగంపేట వచ్చాను, కుటుంబ సమేతంగా!

లలితకి నా జాగ్రత్తమీద నమ్మకం సడలింది. అన్నీ తన దగ్గరే ఉంచింది. నా అజాగ్రత్తకి చివాట్లు పడ్డాయి. ఈ మొత్తం ప్రహసనంలో నాజర్ లాంటి వ్యక్తి తారసపడడం ఆశ్చర్యం అనిపించింది. అతను ఆ పాస్పోర్ట్ తీసుకుపోయి డబ్బులిస్తే కాని ఇవ్వనని చెప్పచ్చు. నేనిచ్చినా తిరస్కరించడంతోనే అతని వ్యక్తిత్వం ఎంత గొప్పదో అయ్యింది. నాలుగు ఫర్లాంగుల దూరం వెళితే చాలు, డబ్బు ఎక్కువ ఇస్తారా చస్తారా అని నిలదీసే ఆటోవాళ్ళని చూసాను. కానీ నాజర్ లాంటి వాళ్ళు తారసపడడం ఇదే మొదటిసారి నాకు. భగవంతుడు ఎక్కడో లేడు, ఇలాటి వ్యక్తుల్లోనే నివసిస్తాడు.

చెకింగ్ కౌంటర్ దగ్గర ఒకతను పెట్టెలు బెల్ట్‌మీద పెట్టడానికి సహాయం చేసాడు. అతను ఎయిర్‌పోర్ట్‌లో పనిచేసే వ్యక్తే. చెకింగ్ అయ్యాక "సార్!"అంటూ నా వెనుకే వచ్చాడు. నాకర్థమయ్యింది అతను డబ్బులు అడుగుతున్నాడని, అతను నాకంటూ చేసిందేమీ లేదు. పెట్టెలు వెయింగ్ మెషీన్ మీద పెట్టడం అతని ఉద్యోగం. అది చేసినందుకు నేను అతనికి డబ్బులివ్వాలి.

నాకు నాజర్ గుర్తుకొచ్చాడు. నాజర్ నన్ను ఆలోచింపచేస్తున్నాడు.

"ఏం సార్! అడుగుతున్నాం కదా సార్!" వెంటబడ్డాడు. లేదన్నట్లుగా తలూపుతూ అక్కడనుండి వచ్చేసాను. అడగడానికి, అడుక్కోడానికి తేడా లేకుండా పోతోంది. మాకు చెకింగ్ పిలుపు వచ్చింది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి నేను లలిత అక్కడ వెయిటింగ్‌ప్లేస్‌లో కూర్చున్నాం. టీవీ పెట్టారు. ఈ టీవీ వార్తలు వస్తున్నాయి. ఒక వార్త నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది.

"ఈరోజు రాష్ట్రపతి కేంద్ర పోలీసు విభాగంలో అత్యున్నత సేవలందించిన ఉద్యోగులకి అవార్డులు ప్రకటించారు. ఇందులో మన రాష్ట్రానికి చెందిన నాంపల్లి స్టేషన్ ఎస్.ఐ. శ్రీ ఎన్.గోవర్ధనరెడ్డి ఒకరు. శ్రీ గోవర్ధనరెడ్డికి లభించిన ఈ అవార్డు చూసి "ఇది రాష్ట్ర పోలీసులు గర్వించదగ్గ విషయమని, విధి నిర్వహణలో గోవర్ధనరెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని" పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

ఈ వార్త విని ఒక్కసారి అవాక్కయ్యాను.

నేను నాంపల్లి స్టేషన్‌లో అయిదువేలు ఇచ్చిందెవరికో లలితకి చెప్పాను. ★